

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక



ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 05 | ఆదివారం 05, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం



- బావిలోకి దూసుకెళ్లిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి

ముంబై, ఏప్రిల్ 4 :మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు,

2లో

## అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను

- చకచకా పనులు సాగి తీరాల్సిందే
- అమరావతి చరిత్రలో అందరూ భాగస్వాములే
- నిర్మాణ పనులపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 4 : రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు,

2లో

## సిబిఎస్ఇ త్రిభాషా విధానంపై ఆగ్రహం

- ఇది హిందీని రుద్దే కార్యక్రమంగా ఉంది
- తమిళనాడు సిఎం స్టాలిన్ అభ్యంతరం


చెన్నై, ఏప్రిల్ 4 : 2026-27 విద్యా సంవత్స రంలో 6వ తరగతి నుండి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్ట నున్నట్లు సిబిఎస్ఇ తాజాగా ప్రకటించింది. త్రిభాషా విధానంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రాంతీయ భాషల కంటే హిందీకి ఎక్కువ ప్రాధాన్యత నివ్వడానికి, ఆ భాషను బలవంతంగా రుద్దడానికి చేసే ప్రయత్నమేనని ఆయన మండిపడ్డారు. ఈ విధానం సమాఖ్యవాదాన్ని దెబ్బతీస్తుందని, హిందీ మాట్లాడని రాష్ట్రాలను అణచివేస్తుంది. పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులపై అనవసర భారాన్ని మోపుతుందని స్టాలిన్ ఆరోపించారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని, రాష్ట్రాల వ్యాప్తంగా విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని

2లో



## 28 జిల్లాలతో కొత్తగా ఏపి మ్యాప్ విడుదల

- అమరావతి ప్రాంతానికి ప్రత్యేకంగా గుర్తింపు



అమరావతి, ఏప్రిల్ 4 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ అధికారిక మ్యాప్‌ను ఈ నెల 2వ తేదీన ప్రచురించారు. ఇందులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. రాజధాని అమరావతి ప్రస్తావన, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా పొందుపరిచారు. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్

2లో

## జగన్‌ను చూసి ప్రజలు చీదరించుకుంటున్నారు

- అమరావతికి ఆమోదించాక ఓర్వలేక మావిగన్ అంటూ వ్యాఖ్యలా
- ఇక జగన్ రాజకీయ జీవితం ముగిసినట్లే: భాను ప్రకాశ్



తిరుపతి, ఏప్రిల్ 4 : వైసీపీని ఏపీ ప్రజలు చీదరించుకున్నారని.. ఓడిపోయిన తర్వాత రాష్ట్రంపై జగన్ ద్వేషం పెంచుకున్నారని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి అన్నారు. పార్లమంట్ ఉభయసభల్లో అమరావతి బిల్లుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆమోదం తెలిపారని.. దాన్ని ఓర్వలేక జగన్ 'మావిగన్' అని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని అది అమరావతి అని తేల్చిచెప్పారు. మళ్లీ జగన్ అధికారంలోకి వచ్చేది లేదు.. చూసేది లేదన్నారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చేది ఒక కల మాత్రమే అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఒక కామెడీ యాక్టర్‌గా మిగిలిపోయారని.. ఆ వీడియోలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. మాజీ సీఎం అపరిచితుడిగా మారిపోయారంటూ వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఓ విధంగా.. ఓడిపోయిన తర్వాత మరో విధంగా ఉండే వ్యక్తి జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు గెలుపు ఓటములు సర్వసాధారణమన్నారు. బంగారు పంటలు పండే భూములను రైతులు.. రాష్ట్ర ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. అలాంటి రైతుల కళ్లల్లో కన్నీళ్లు పెట్టించి జైల్లో వేసి జగన్ రాక్షసానందం పొందారని విమర్శించారు. ఏపీని అభివృద్ధి ప్రదేశ్‌గా ఎన్డీఏ కూటమి ముందుకు తీసుకెళ్తోందని భాను ప్రకాశ్ వెల్లడించారు. ప్రజలు 2024లో ఓటు అనే గన్ ఆయుధంతో వైసీపీని పేల్చితే.. 164 సీట్లలో పిట్టలుగా లేచిపోయారని.. కేవలం 11 సీట్లు మాత్రం వచ్చాయని అన్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు11 సీట్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రశాంత

2లో

## ట్రంప్ నియంత్రణలో మోదీ ఆయన నియంత్రణలో పినరయి...

### రాహుల్ విసుర్లు



ఇడుక్కి , ఏప్రిల్ 4 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని, అత్యంత అవమానకరమైన విషయం ఏమిటంటే ట్రంప్‌ను 'సర్' అని ఆయన పిలుస్తారని చెప్పారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలంలో ఉన్నానని అనుకుంటున్నారని విమర్శించారు. మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే పిన

2లో

## పౌష్టికాహారంగా మధ్యాహ్న భోజనం

- షెడ్యూల్ ప్రకారం వంటకాలు
- పెనమలూరు స్కూల్‌ను తనిఖీ చేసిన మంత్రి కొల్లు



మచిలీపట్నం, ఏప్రిల్ 4 :మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు చాలా సంతృప్తిగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత

2లో

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సంపాదకీయం

## గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రామాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ది చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ది చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా

నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి స్వాద్యం కాగలదు.

## సిబిఎస్ఇ త్రిభాషా విధానంపై ఆగ్రహం

కేంద్ర ప్రభుత్వాన్ని స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) విద్యార్థులు మూడు భాషల్ని చదవాలని తెచ్చిన కొత్త పాఠ్యప్రణాళిక విధానం నిష్కపటమైన విద్యా సంస్కరణ కాదు. ఇది హిందీని బలవంతంగా రుద్దాలని ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నం. ఇది బిజెపి హిందీని మాపై బలవంతంగా రుద్దుతుంది అన్న ఆందోళనల్ని నిజం చేస్తుంది. భారతీయ భాషలను ప్రోత్సహించే ముసుగులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం భారతదేశపు గొప్ప, వైవిధ్యభరితమైన భాషా వారసత్వాన్ని క్రమపద్ధతిలో అణచివేస్తూ, హిందీని ప్రాధాన్యతనిచ్చే కేంద్రీకరణ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. మూడు భాషల సూత్రం అని పిలిచేది వాస్తవానికి హిందీ మాట్లాడని ప్రాంతాలలోకి హిందీని విస్తరించడానికి ఉద్దేశించిన ఒక రహస్య యంత్రాంగం. కేంద్ర ప్రభుత్వ పాఠ్య ప్రణాళిక విధానం హిందీ మాట్లాడే విద్యార్థులకు నిర్మాణాత్మకంగా ప్రాధాన్యతనిస్తుంది. నిష్పక్షపాతాన్ని, సమాఖ్యవాదాన్ని, ప్రాంతీయ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో విమర్శించారు. ఇలాంటి విధానాలు భారతదేశ భాషా వైవిధ్యానికి ముప్పు కలిగిస్తాయని స్టాలిన్ హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రాంతీయ గుర్తింపు కోసం నిలబడాలని తమిళనాడులోని ఏఐఎడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలకు ఆయన పిలుపునిచ్చారు. భాషా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులను హిందీని నేర్చుకోవడం తప్పనిసరి చేస్తుంది. మరి హిందీ మాట్లాడే రాష్ట్రాల విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, లేదా బెంగాలీ, మరాఠీ వంటి భాషలను కూడా తప్పనిసరిగా నేర్చుకుంటారా? దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు మధ్య నేర్చుకునే విధానంలో స్పష్టత లేదు. ఈ విధానం ఏకపక్షంగా హిందీని రుద్దడమనే వివక్షాపూరిత స్వభావాన్ని బయటపెడుతుంది. ఈ వైరుధ్యం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల్లో తమిళాన్ని తప్పనిసరి భాషగా చేయడంలో విఫలమైంది. తమిళ భాషను బోధించడానికి తమిళ ఉపాధ్యాయులను నియమించడంలో విఫలమైంది. మరి ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలను ప్రోత్సహించడంపై రాష్ట్రాలకు ఉపన్యాసాలు ఇవ్వాలని చూస్తోందని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఇది భాషల పట్ల కేంద్రం చూపే వైఖరి నిబద్ధత కాదు.. పచ్చి కపటత్వం అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ధ్వజమెత్తారు. మిళనాడు అనేక ఇతర రాష్ట్రాలు లేవనెత్తి చట్టబద్ధమైన, స్థిరమైన ప్రజాస్వామ్యయుతమైన ఆందోళనలను పక్కనపెట్టి, హిందీని రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ విధానం సహకార సమాఖ్యవాద సూత్రాలకు విరుద్ధం. లక్షలాది మంది భారతీయుల భాషా గుర్తింపు అవమానించడమే అని స్టాలిన్ అన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరు పళనిస్వామి నేతృత్వంలోని ఏఐఎడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలు ఈ రుద్దకాన్ని అంగీకరిస్తాయా? లేక ఒక్కసారైనా మన విద్యార్థుల హక్కులు, గుర్తింపు, భవిష్యత్తు కోసం నిలబడతాయా? అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు.

## అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను

అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు. ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా? అంటూ సున్నితంగా హెచ్చరించారు. రగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన బాధ్యత లేదా? అంటూ కాంట్రాక్ట్ సంస్థలను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మాణ సంస్థలు సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలన్నారు. అలా చేయకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు సీఎం. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సీఎం చంద్రబాబు వారికి తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ స్థలంలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారు. ప్రతి నిర్మాణ సంస్థ ఎంత మేరకు పనులు పూర్తి చేసింది, టార్గెట్లను ఎంతవరకు సాధించింది అనే విషయాలపై పనుల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కార్మికుల సంఖ్య, యంత్రాల వినియోగం వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ చేపట్టారు. వారం, నెలవారీ టా÷-గ్గ్÷ట్‌లు నిర్దేశిరచుకుని పనులు పూర్తి చేయాలని అధికారులు, సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వర్షాకాలం ముందు పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు తమ లక్ష్యాలను సీఎంకు వివరించారు. రాజధాని నిర్మాణాన్ని కేవలం కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని.. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములవుతున్నట్టే అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. 'నిర్మాణ సంస్థలుగా మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు... కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్ఠను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశిరచిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షకు మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేపట్టిన వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయి. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్టక్చర్, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌తో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన పనుల సంబంధిత వివాదాలు, సమస్యలను పరిష్కరించి సీఆర్డీఏ మళ్లీ పనులను చేపట్టింది. నాటికి నేటికి నిర్మాణ వ్యయం పెరగడం వంటి సవాళ్లను అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులను అప్పగించింది సీఆర్డీఏ.

## మహిరాష్ట్రలో ఘోర ప్రమాదం

రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపౌ ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు.

## 28 జిల్లాలతో కొత్తగా ఎపి మ్యాప్ విడుదల

చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని 'రాష్ట్ర రాజధాని' గా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేక బౌండరీలను కేటాయించకుండానే, ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని.. రాష్ట్ర రాజధానిగా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు.. గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా.. ఇటీవల మార్కాపురం, పోలవరం అనే రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు జిల్లాల సరిహద్దులను కూడా తాజా మ్యాప్‌లో తెలియజేశారు. దీంతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వాహణ శాఖ ఈ మ్యాప్‌ను విడుదల చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం.. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో జిల్లాల వారీగా సహాయక చర్యలు చేపట్టడానికి స్పష్టమైన భౌగోళిక సమాచారం ఉండటమే. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధతను ఈ మ్యాప్ తొలగించనుంది.

## ట్రంప్ నియంత్రణలో మోదీ

రయి విజయన్‌ను మోదీ నియంత్రిస్తున్నారని అన్నారు. కేరళంలోని ఇడుక్కిలో శనివారం నాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, బీజేపీతో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కుమ్మక్కయిందని ఆరోపించారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్, లెఫ్ట్ ఫ్రంట్ మధ్య సంబంధాలను ఇవాళ ప్రతి ఒక్కరూ చూడొచ్చు. లెఫ్ట్ ఫ్రంట్‌లో సిద్ధాంతాల కోసం ఎళ్లతరబడి పనిచేసిన అవకాశవాదులు కాని కొందరు ఇప్పుడు తమను పార్టీ వంచించిందని ఆవేదన చెందు తున్నారు' అని రాహుల్ తెలిపారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కయినందునే ఎల్‌డీఎఫ్ తన వామపక్ష భావజాలాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ఎప్పుడూ సైద్ధాంతిక ప్రత్యర్థిగా ఎల్‌డీఎఫ్‌తో పోరాడేదని, ఇప్పుడు ఎల్డీఎఫ్ మారిపోయిందని, ఎల్‌డీఎఫ్‌లో 'లెఫ్ట్' అనేదే లేదని, ఎన్నికల తర్వాత అందులో ఏదీ మిగలదని అన్నారు. కేరళలోని ప్రభుత్వాన్ని ఒక చీకటి శక్తి ప్రభావితం చేస్తోందని, అది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజలపై దాడి చేస్తోందని పరోక్షంగా బీజేపీ- ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి మోదీ ఏ రాష్ట్రానికి వెళ్లిగా మతం, ఆలయాలు గురించి మాట్లా డతారని, కేరళ అంశాల విషయానికి వచ్చేసరికి మాత్రం పెదవి విప్పరని శబరిమల బంగారం కేసును ప్రస్తావిస్తూ అన్నారు. ఎల్‌డీఎఫ్‌కు హెల్ప్ చేయాలని ఆయన అనుకోవడమే అందుకు కారణమని వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతున్నం దున తనపై చాలా కేసులు పెట్టారని, ఇంటరాగేట్ చేశారని, అయినా కూడా తాను వెనుదీయలేదని చెప్పారు. మోదీ ప్రతిరోజూ తనపై విమర్శల దాడి చేస్తారని, కానీ కేరళ సీఎం గురించి కానీ, ఆయన కుటుంబం గురించి కానీ ఒక్క మాట మాట్లాడ రని అన్నారు. జాతీయ అంశాలపై మోదీని ఎల్డీఎఫ్ ఎప్పుడూ సవాలు చేయకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. ఏప్రిల్ 9న కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## జగన్‌ను చూసి ప్రజలు చీదరించుకుంటున్నారు

వాతావరణంలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పుకొచ్చారు. జగన్ చేష్టలను ఏపీ ప్రజలు చీదరించుకుంటున్నారని భానుప్రకాశ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో వెళుతోందన్నారు. 2019లో వైసీపీ ఏపీని అప్పుల ప్రదేశ్‌గా మార్చిందని భాను ప్రకాశ్ విరుచుకుపడ్డారు. జగన్, వైసీపీకి ఏపీ ప్రజలు విడాకులు ఇచ్చారన్నారు. అమరావతి రైతుల శాపం జగన్‌కు తగిలిందన్నారు. ఏపీలో వైసీపీ ఫ్యాన్ తిరగదని.. కామెడీలతో జగన్ శేష జీవితం పూర్తవుతుందని అన్నారు. భూమన కరుణాకర్ రెడ్డికి చేతనైతే జగన్ చేతిలో భగవద్గీత పెట్టాలని సవాల్ విసిరారు. ఇంట్లో దేవాలయాల సెట్లు వేసుకుని.. కనీసం తీర్థం కూడా తీసుకోరంటూ జగన్‌పై భాను ప్రకాశ్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## పౌష్టికాహారంగా మధ్యాహ్న భోజనం

సన్న బియ్యంతో పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఆకుకూరలు, పప్పు కూరలు ఏ రోజు ఏమి వడ్డించాలో ఓ షెడ్యూల్ ప్రకారం భోజనం అందిస్తున్నామని అన్నారు. ప్రతిరోజు భోజనంతో పాటు ఒక గుడ్డు కూడా విద్యార్థుల ఆరోగ్యం కోసం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యం, రేషన్ బియ్యంతో భోజనం పెట్టి విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకున్నారని విమర్శించారు. పెనమలూరు ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థులతో మాట్లాడి టీచర్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో లావు బియ్యంతో భోజనం వడ్డించేవారని, ప్రస్తుతం సన్న బియ్యంతో మంచి భోజనం పెడుతున్నారని మంత్రికి విద్యార్థులు చెప్పారు.



## రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిని కలిసిన శనివారపు మోహన్ రెడ్డి

సిద్ధవటం (ప్రజా సీమ ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ మరియు యూత్ అండ్ స్పోర్ట్స్ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని శుక్రవారం ఉదయం బోరెడ్డి గారి పల్లె తన నివాసంలో సిద్ధవటం మండలం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి కలవడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం మోహన్ రెడ్డి మాట్లాడుతూ సిద్ధవటం మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి త్వరగా పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి తో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## రాజంపేటలో ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి హౌస్ అరెస్ట్



రాజంపేట (ప్రజాసీమ):టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, వైకాపా నియోజకవర్గ ఇంచార్జ్ ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డిని మన్నూరు పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, అనంతరం ప్రెస్ మీట్ పెట్టాలని ఆయన భావించగా, పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.తిరుమల పవిత్రతను కాపాడాలం టూ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. పోలీసుల కట్టడిపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## అభివృద్ధి పనుల్లో రాజకీయ జోక్యం మంచిదికాదు

### - మున్సిపల్ కమిషనర్‌కు బహుజన యువసేన వినతి



మదనపల్లె (ప్రజాసీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి పట్టణంలో ఆర్ అండ్ బి రోడ్ల విస్తరణ మరియు ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో అధికారులు అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరిని నిరసిస్తూ బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ కుమార్ శనివారం మునిసిఫల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ మదనపల్లి జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రోడ్ల విస్తరణ చేపట్టడం శుభపరిణామమని,అయితే ఈ ప్రక్రియలో,మరికొందరిపై చర్యలు తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు.ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న అక్రమ బంకులు,టీకొట్టుల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.చిత్తూరు బస్టాండ్ నుండి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే మార్గంలో వ్యాపార సంస్థలు రోడ్లను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాల వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని,ఇక్కడ విస్తరణ పనులు ఎందుకు నిలిపివేశారని ఆయన ప్రశ్నించారు.అభివృద్ధి పనుల్లో రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా,పట్టణమంతటా ఒకే నిబంధన పాటించాలని కోరారు.ఆక్రమణల తొలగింపులో వివక్ష చూపిస్తే సాధారణ ప్రజల్లో అసహనం పెరుగుతుందని,వెంటనే పైన పేర్కొన్న ప్రాంతాల్లోని ఆక్రమణలను తొలగించి,రోడ్డు విస్తరణను యుద్ధప్రతిపాదికన పూర్తిచేయాలని పునీత్ కుమార్ డిమాండ్ చేశారు.లేనిపక్షంలో బహుజన యువసేన ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# తిరుమల పవిత్రతను కాపాడాలి

### - దేవుళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలి: వైఎస్ఆర్‌సీపీ నేతలు



రాయచోటి (ప్రజా సీమ) : రామాపురం మండలం హసనాపురం గ్రామం యర్రంగివాండ్లపల్లెలోని శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తిరుమల పవిత్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కూటమి నేతలు రాజకీయ లాభాల కోసం దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడం సరైంది కాదని విమర్శించారు. తిరుమల లడ్డూ విషయంలో ఎటువంటి ఆధారాలు లేకుండానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దుష్ప్రచారం చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు నియమించిన కమిటీ పరీక్షలలో లడ్డూలో జంతువుల కొవ్వు లేదని తేలినా, ప్రభుత్వం ప్రచారం ఆపలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి కంటే ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో పక్కా గృహాల నిర్మాణానికి భారీగా నిధులు ఖర్చు చేశామని, కానీ ప్రస్తుతం కూటమి నేతలు చేసిన పనులపై నిందలు వేస్తున్నారని అన్నారు. అమరావతి రాజధాని కోసం అధిక వ్యయం చేస్తున్నారని కూడా ఆయన పేర్కొన్నారు. వెలిగల్లు ప్రాజెక్ట్, కాలేటి వాగు వంటి ప్రాజెక్టుల పనులను ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, అవి పూర్తయితే ప్రాంతానికి సాగునీరు అందుతుందని తెలిపారు. జల జీవన్ మిషన్ కూడా జగన్ హయాంలోనే ప్రారంభమైందని గుర్తుచేశారు. రాయచోటి జిల్లా కేంద్రాన్ని తొలగించడం దుర్మార్గమని శ్రీకాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో గ్రామ కమిటీల ఏర్పాటుకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### దళిత మహిళపై దాడి ఘటనను

# ఖండించిన కాంగ్రెస్ నేతలు

పుల్లంపేట (ప్రజా సీమ) :తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గంలో దళిత మహిళా ఉద్యోగిపై జరిగిన దాడి ఘటనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్య మాట్లాడుతూ, టోల్‌గేట్ గాంధీ విగ్రహం వద్ద హర్ష వీణ అనే మహిళపై జనసేనకు చెందిన నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర మరియు అతని అనుచరులు పోలీసుల సమక్షంలోనే దాడి చేసి కులదూషణకు దిగడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. మహిళ అని చూడకుండా నడిరోడ్డుపై దాడి చేయడం కుల దురహంకారానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. మహిళలపై దాడులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఈ ఘటనలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై స్పందించి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం విఫలమైందని, దళిత మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన



వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై అన్ని వర్గాల నాయకులు, దళిత సంఘాలు స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రైల్వే కోడూరు కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వామపక్ష నాయకులు, పుల్లంపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిగమాల రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాసల బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం

పుల్లంపేట (ప్రజా సీమ): తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలోని గ్రామ పంచాయతీలలో సర్పంచ్ పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియడంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్లను నీయామకం జరిగినట్లు ఎంపీడీవో జయశ్రీ తెలిపారు.మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అనంతసముద్రం, జాగవారిపల్లి, పుల్లంపేట గ్రామాలకు ఎంపీడీవో జయశ్రీ, కొత్తపేట, పుత్తనవారిపల్లికి తహసీల్దార్ పుల్లారెడ్డి నియమితులయ్యారు. అలాగే అనంతయ్యగారిపల్లి, దలవాయిపల్లి, పివీజీ పల్లి, రామసముద్రం గ్రామాలకు ఏవో శ్రీధర్ రెడ్డి, బావికాడిపల్లి, రామాపురం, తిప్పాయిపల్లికి ఎంఈఓ చక్రధర్ రాజు, రంగంపల్లి, అనంతంపల్లికి ఎంఈఓ నాగ తిరుమలరావు, రెడ్డిపల్లి, టీ. కమ్మపల్లికి అగ్రికల్చర్ అధికారి ప్రవీణ్ .అప్పయ్యరాజుపేట, గారాలమడుగు, దండ్లోపల్లి, కొమ్మలవారిపల్లికి డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, కోనయ్యగారిపల్లి, వత్తలూరుకు మండల జీఎస్‌డబ్ల్యూ అధికారి లక్ష్మీపతి ప్రత్యేక అధికారులుగా నియమించబడ్డారు.

గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలన సజావుగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సూచించారు.

## రైతులు వన్యప్రాణులకు హాని కలిగించకూడదు

### - పంట నష్టపోయిన రైతుకు పరిహారం అందజేత

### - వెల్లడించిన అటవీశాఖ అధికారులు




మదనపల్లె (ప్రజాసీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె రేంజ్ పరిధిలోని చీకలబైలు బీట్,పొన్నీటిపాళ్యం పంచాయతీ,పిచ్చలోల్లపల్లి గ్రామానికి చెందిన వై.వెంకట రమణా రెడ్డికి పంటకు నష్టపరిహారం రూ. 7,500 చెక్కును శనివారం ఎఫ్.ఆర్.ఓ జి.జయప్రసాదరావు,డి.ఆర్.ఓ వి.శివరంజిని,ఎఫ్.బి.ఓ ఉమాదేవిలు అందజేశారు.ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు రైతులకు అండగా నిలుస్తూ,నష్టపరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అలాగే రైతులు వన్యప్రాణులకు ఎలాంటి హాని చేయకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు.వన్య ప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ఎంతో ముఖ్యమని,పంటలకు నష్టం కలిగిన సందర్భాల్లో వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు.వన్యప్రానులకు హాని కలిగించడం చట్టరీత్య నేరమన్నారు.

## వైఎస్ఆర్సిపిలో సమర్ధవంతమైన బీసీ నేత రమేష్ యాదవ్

### - జిల్లా బీసీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ మజ్జిగ కేశవ్ యాదవ్ ప్రశంసలు



మదనపల్లె (ప్రజాసీమ) : వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ విభాగాన్ని అధ్యక్షుడు రమేష్ యాదవ్ సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నాడని అన్నమయ్య జిల్లా బీసీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేశవ యాదవ్ పేర్కొన్నారు.శుక్రవారం వైఎస్సార్ కడప జిల్లా పర్యటనకు విచ్చేసిన రమేష్ యాదవ్ ని కమలాపురంలో మజ్జిగ కేశవ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా ఆయనను శాలువా,పూల మాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారిరువురూ బీసీ విభాగం బలోపేతంపై కాసేపు చర్చించుకున్నారు.ఈ సందర్భంగా కేశవ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యతపిస్తున్నారని,రాజకీయంగా వారి ఎదుగుదలకు పెద్దపీట వేస్తున్నారన్నారు.పార్టీలో అత్యంత కీలక విభాగమైన బీసీ విభాగానికి రమేష్ యాదవ్ లాంటి చురుకైన నాయకుడిని నియమించడం అదనపు బలమని కొనియాడారు.ఆయన రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ వైకాపా బీసీ విభాగం బలోపేతానికి నిర్విరామకృషి చేస్తున్నారన్నారు.రమేష్ యాదవ్ సూచనలు రాజకీయంగా తనకు ఎంతో దోహదపడతాయన్నారు.ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,మదనపల్లి వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకులని,వారి సూచనలు మేరకు పనిచేసి అన్నమయ్య జిల్లాలో బీసీ విభాగాన్ని బలోపేతం చేయాలని తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారన్నారు.

## ఆ అధికారి రూటే సెప "రేటు"

### - సమయపాలన లేని అధికారులు
### - అతను ఎపుడు వస్తాడో , ఎపుడు వెళ్తాడో కూడా తెలియదంటున్న తోటి ఉద్యోగులు
### - అతని తీరుపై సర్వత్రా విమర్శలు ఆరోపణలు అయినా బేఖాతర్




రాజంపేట (ప్రజా సీమ): రాజంపేట మున్సిపాలిటీ లో ఆ అధికారి సమయానికి విధులకు రావాల్సింది ఉన్నప్పటికీ ఇష్టానుసారంగా హాజరవుతున్నాడనీ విమర్శలొస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమయానికి హాజరు కావాల్సింది పోయి మాదే ఆఫీసు నా ఇష్టం వచ్చినప్పుడు వెళ్తాను నన్నెవరు అడిగేవారు అన్నట్టు అతని తీరు పై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పని నిమిత్తం పై ఆ అధికారి కోసం కార్యాలయానికి వస్తే కాలీ సీటు దర్శనం ఇస్తుంది.సారు ఎక్కడికి వెళ్ళాడని అడిగితే తోటి ఉద్యోగులే అతని తీరు పై అసహనం వ్యక్తం చేస్తున్నారు.అతని తీరు పై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరిగినా అతని పై చర్యలు శూన్యం.ఇతని పని కి ఒక రేటు , రేటు కుదరకపోతే సర్వర్ ఓపెన్ కావట్లేదు , మళ్లి రండి అనే సమాధానం కార్యాలయంలో అందరికి తెలిసిన పదం.ఇతని పై బాధితులు ఒక్కొక్కరుగా పిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరి ఈ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాలి.

## "అమరావతి రాజధాని నిర్ణయంపై విద్యార్థుల హర్షం"



పుల్లంపేట ప్రజా సీమ న్యూస్: పుల్లంపేట మండలం కొత్తపేట మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందిన సందర్భంగా ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కాసాల లక్ష్మిదేవి, ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ జి.పి. హైమావతి,ఎస్సై చిన్నారెడ్డప్ప, అలాగే ఉపాధ్యాయులు విజయలక్ష్మి, పూర్ణిమ,సుధారాణిపాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని "జై అమరావతి" నినాదాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారు మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని, విద్యార్థులు కూడా భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. రాజధాని ఏర్పాటు పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## మత్తు సమాజానికి, కుటుంబానికి ముప్పు







పుల్లంపేట (ప్రజా సీమ):ఏ ఎమ్ లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో నషాముక్త భారత అభియాన్ కార్యక్రమము పుల్లంపేట శివాలయం కల్యాణ మండపంలో జరిగినది. మత్తు సమాజానికి మరియు దేశానికి హానికరం అంటూ విద్యార్థులకు మత్తు వలన జరిగే నష్టాలను వివరించారు. ఈ అవగాహన సదస్సులో శాంతినికేతన్, ప్రత్యూష మరియు ఎస్ బి వి డి సభ హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లాయర్ బి సురేష్ కుమార్, పుల్లంపేట సబ్ ఇన్స్పెక్టర్ చిన్న రెడ్డప్ప, రిటైర్ లెక్చరర్ సుబ్బరాయుడు, అడ్వకేట్లు అరుణ్ కుమార్ రాజు మనోహర్ రెడ్డి మరియు జై సింహ స్వామి పాల్గొన్నారు.

## వందలమంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసిన కాకతీయ సేవా సమాజం



రాజంపేట (ప్రజా సిమ) పెంచలకోన లక్ష్మి నరసింహ స్వామివారి ఆలయం వద్ద వెలసి యున్న శ్రీ కాకతీయ అన్నదాన సేవా సమాజం ప్రతి వారం చేసినట్లే ఈ రోజు కూడా పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేసింది..ఎంతో మంది భక్తులకు పరిశుభ్రమైన రుచికరమైన అన్ని రకాలతో కూడిన ఆహారాన్ని శ్రీ సీతా పెంచల నాయుడు, శ్రీమతి శివ కుమారి దంపతుల సహకారంతో అందించారు. ఈ కార్యక్రమం లో సేవాసమాజం అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు రామచంద్ర నాయుడు, కొల్లపనేని వెంకటేశ్వర్లు నాయుడు,పువ్వాడ రామసుబ్బయ్య నాయుడు,పెనిగలపాటి చంద్ర నాయుడు,రావూరి శ్రీనివాసులు నాయుడు,కొల్లపనేని శివాజీ నాయుడు,తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# టిటిడి చైర్మన్ పదవి నుండి బి.ఆర్.నాయుడుని తొలగించాలి

**- తిరుమల తిరుపతి పవిత్రతను కాపాడాలి**

**- మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ డిమాండ్**





మదనపల్లె (ప్రజాసీమ) : పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ రాసలీల బి.ఆర్.నాయుడు ఉదంతం వెలుగులోకి వచ్చినా సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోకపోవడం లక్షలాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని మదనపల్లె వైఎస్సార్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు.పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీ.ఆర్.నాయుడు అపవిత్రుడని,టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మదనపల్లె శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం స్దానిక అవెన్యూ రోడ్డులోని వైయస్సార్సిపి కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.ఇప్పటికీ బీ.ఆర్ నాయుడును వెనకేసుకొస్తున్న సిఎం చంద్రబాబునాయుడు ప్రపంచవ్యాప్తంగా హిందూ భక్తుల విశ్వాసం నమ్మకంపై ఆటలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాసలీల సాగిస్తూ దొరికిన అతడిపై చర్యలు తీసుకోకుండా వదిలి వేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.విచారణ జరిపి అతడిని తొలగించాలని భక్తులు కోరుతున్న పట్టించుకోకుండా సమర్థించడం సిఎం హోదాలో చంద్రబాబునాయుడుకు తగదన్నారు.ఆధ్యాత్మిక కేంద్రంలో ఇలాంటి వ్యక్తి చైర్మన్‌గా వుండటం దురదృష్టకరమన్నారు.ఇంతకంటే మంచి క్యారెక్టర్ వుండే వారు మీకు దొరకలేదా లేక ఇలాంటి వ్యక్తి వుండాలని మీరే నిర్ణయించారా అని మీడియా ముఖంగా నిలదీశారు.శ్రీ వెంకటేశ్వర స్వామిపైన మీకు భక్తి,నమ్మకం వుంటే బి.ఆర్.నాయుడును తొలగించి చిత్తశుద్ధి నిరుపించుకోవాలని సూచించారు.బీ.ఆర్. నాయు డును తోలగించే వరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు.ఖచ్చితంగా అతడిని తొలగించాలని,లేనిపక్షంలో అతడిని తొలగింపు చేయాలనే డిమాండును మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు శ్రీనాథ్ రెడ్డి,మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజా రెడ్డి,ఎల్.రఘునాథ్ రెడ్డి,వి.ఎస్.రెడ్డి,శీలం రమేష్,మాజీ కౌన్సిలర్లు ప్రసాద్ బాబు,ఈశ్వర్ నాయక్, శ్రీనివాసులు,కొత్తపల్లి మహేష్ బాబు,శరత్ రెడ్డి,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,రామారావు కాలనీ నూర్,తాలే సుబ్రహ్మణ్యం, పవన్ తేజ,యునస్,మహబూబ్ బాషా,హబీబ్,శారదా రెడ్డి,వినుతా భాయి,మంజుల, నాగమణి,ధ నలక్ష్మీ పెద్దఎత్తున వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిట్స్ యూనివర్శిటీలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం

**- ఉద్యోగ అవకాశాలు,ఇంటర్న్‌షిప్‌లపై విద్యార్థులకు అవగాహన**







కురబలకోట (ప్రజాసీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు నందు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం మరియు మిట్స్ అల్యూమిని వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ నందు 2018 మరియు 2025 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సయ్యద్ మాజ్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు మరియు ప్రస్తుత విద్యార్థుల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడంలో అల్యూమిని పోర్టల్ మరియు లింక్డ్ఇన్ వంటి వేదికలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు.అల్యూమిని పోర్టల్ ద్వారా పూర్వ విద్యార్థుల వివరాలు ఒకే వేదికలో అందుబాటులో ఉండటంతో,వారితో సులభంగా సంబంధాలు ఏర్పరచుకోవచ్చునన్నారు.ఉద్యోగ అవకాశాలు,ఇంటర్న్‌షిప్‌లు,మెంటారింగ్ వంటి అనేక అవకాశాలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.అలాగే లింక్డ్ఇన్ ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలు,ప్రాజెక్టులు,విజయాలను ప్రపంచానికి పరిచయం చేసుకొని,పరిశ్రమ నిపుణులతో నెట్‌వర్క్ పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ వేదికలను సమర్ధవంతంగా వినియోగించుకోవడం ద్వారా విద్యార్థులు తమ కెరీర్ అభివృద్ధిని వేగవంతం చేసుకోవడంతోపాటు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్యూమిని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగశ్వేతా మాట్లాడుతూ అల్యూమిని మరియు యూనివర్సిటీ మధ్య బలమైన అనుబంధం కొనసాగితే విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని,సమాజానికి ఉపయోగపడే నాణ్యమైన ఇంజినీర్లను తయారు చేయడం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇందులో భాగంగా పూర్వవిద్యార్థులు పాల్గొని తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నారు.సంస్థతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ,విద్యార్థి దశలో పొందిన విద్య,మార్గదర్శకం తమ వృత్తి జీవితంలో ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డీన్-ఇండస్ట్రీ రేలేషన్స్ డాక్టర్ పి.ఎమ్ బాలాజీ,డాక్టర్ ఏ.వి పవన్ కుమార్,అల్యూమిని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగ శ్వేతా మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఢిల్లీలో అంధ్రప్రదేశ్ మైనార్టీ నాయకుల పర్యటన

**- బిజెపి కార్యాలయంలో ఘనసన్మానం**

మదనపల్లె (ప్రజాసీమ) : దేశ రాజధాని ఢిల్లీలో ఏపీ మైనార్టీ నాయకులు పర్యటిస్తున్నారు.ఇందులో భాగంగా శనివారం భారతీయ జనతా పార్టీ (బిజెపి) జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మైనారిటీ నాయకులకు ఘనంగా సన్మానం జరిగింది.బీజేపీ జాతీయ మైనారిటీ మోర్చా నాయకులు అక్రమ్ సాహెబ్ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షులు చాంద్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు.?ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ నాయకులు డాక్టర్ అయూబ్ ఖాన్ మరియు అఖిల భారతీయ గోరక్ష మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు వేంపల్లి అష్రఫ్ లని శాలువా,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.?పార్టీ బలోపేతం కోసం మైనారిటీలు చేస్తున్న కృషిని జాతీయ నాయకత్వం ఈ సందర్భంగా అభినందించింది.ఏపీలో మైనారిటీల సంక్షేమం మరియు పార్టీ విస్తరణపై ఇందులో భాగంగా చర్చించారు.?జాతీయ స్థాయిలో మైనారిటీ మోర్చా అందిస్తున్న సహకారం పట్ల ఏపీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉర్దూ భాషా వికాసం,జిల్లా సమగ్ర అభివృద్దే లక్ష్యం

**- ఏపీ ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్ స్పష్టం**



మదనపల్లె (ప్రజాసీమ) : అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి మరియు ఉర్దూ భాషా ప్రోత్సాహం దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్ చురుకైన అడుగులు వేస్తున్నారు.ఈ నేపథ్యంలో శనివారం జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్,డి.ఆర్.ఓ కె.మధుసూదన్ రావుని మర్యాదపూర్వకంగా కలసి,పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టంగా కోరారు.ఉర్దూ భాష అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు,అకాడమీ ద్వారా చేపట్టాల్సిన చర్యలపై కూడా విపులంగా వివరించారు.ప్రజా సమస్యల పరిష్కారం మరియు భాష అభివృద్ధి,ఈ రెండు లక్ష్యాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లే దిశగా పఠాన్ ఖాదర్ ఖాన్ కృషి కొనసాగుతోంది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి,మదనపల్లె పట్టణ అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ,మదనపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ముద్దుకృష్ణ నాయుడు,పట్టణ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ప్రణయ్ రాయల్ తదితర నాయకులు పాల్గొని జిల్లా అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# చిరు వ్యాపారస్తులకు అండగా ఉంటాం

**- మున్సిపల్ అధికారుల తీరుపై చమర్తి ఆగ్రహం - మున్సిపల్ అధికారులు అక్రమ వసూలుకు పాల్పడుతున్నారంటూ చమర్తికి పలు ఫిర్యాదులు - నియమ నిబంధనల మేరకే ఇకపై గేటు వసూలు - అక్రమ వసూలు చేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవు**

రాజంపేట,(ప్రజా సీమ) :చిరు వ్యాపారస్తులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వైకాపా ప్రభుత్వం మాదిరిగా దోపిడీకి తావు లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేలా చర్యలు చేపడతామని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. శనివారం నాడు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నందు చిరు వ్యాపారస్తులు పెద్ద ఎత్తున ప్రభుత్వ నియమ నిబంధన మేరకు కాకుండా మున్సిపల్ అధికారులు అధికంగా వసూలు చేస్తున్నారని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు చమర్తి సమావేశమై ఇకపై నియమ నిబంధనలు మేరకే గేటు వసూలు చేయాలని అలా కాకుండా వ్యాపారస్తులను ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోనని కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులకు చమర్తి హెచ్చరికలు జారీ చేశారు.అదేవిధంగా ఆయన చిరు వ్యాపారస్తులతో మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం పేదల ప్రభుత్వం సుపరిపాలన ఇచ్చే ప్రభుత్వమని, నిబంధనలు మేరకే ఇక గేటు వసూలు చేస్తారని ఆయన వారికి భరోసా కల్పించారు. ఆయన వెంట చిరు వ్యాపారస్తులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు , తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు తదితరులు ప్రత్యేకంగా పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

**- ఆర్సిడిఎస్ రాష్ట్ర మహిళా కో-ఆర్డినేటర్ పద్మప్రియా రెడ్డి**
**- తన పుట్టినరోజు వేళ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ**





మదనపల్లె (ప్రజాసీమ) : సాటి మనిషికి సహాయపడటమే మానవత్వానికి నిదర్శనమని ఆర్సిడిఎస్ రాష్ట్ర మహిళా కో-ఆర్డినేటర్ పద్మప్రియా రెడ్డి పేర్కొన్నారు.శనివారం ఆమె పుట్టినరోజును పురస్కరించుకొని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఆర్.సి.డి.ఎస్ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేందర్ రెడ్డి,రాష్ట్ర మహిళా కార్యదర్శి బండారు సుగుణ,ముక్తాపురం సుప్రజా రెడ్డి,డిష్ రెడ్డి కుమారి,మేకల సురేంద్ర,వైఎస్ఆర్సిపి కురబలకోట యూత్ ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి,మదనపల్లి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తట్టి శ్రీనివాసులు రెడ్డి,రెడ్డి సంఘం నాయకులు సాంబశివరెడ్డి,మాజీ సర్పంచ్ శరత్ రెడ్డి,జడ్పిటిసి నల్లపురెడ్డి రమణారెడ్డి,రెడ్డి సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి,జగదీశ్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్ వార్డులలో మరియు ఒపీ వద్ద రోగులకు పండ్లు పంపిణి చేయడం జరిగింది.అనంతరం రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ పద్మ ప్రియ రెడ్డి మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు,బ్రెడ్లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.?తోటి వారికి సహాయం చేయడంలో ఉన్న తృప్తి మరెందులోనూ ఉండదని పేర్కొన్నారు.వివిధ వార్డులను సందర్శించి,చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆర్.సి.డి.ఎస్ అధ్యక్షులు ఎర్రపురెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ??పద్మప్రియ రెడ్డి సామాజిక సేవా రంగంలో చురుగ్గా ఉంటూ,తన పుట్టిన రోజున ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టడాన్ని అభినందించారు. రోగులకు పండ్లు అందజేస్తున్న సమయంలో ఆమె చూపిన ఆప్యాయత మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు.అదేవిధంగా ఆర్.సి.డి.ఎస్ తరపున ఆమెకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఆవె మరెన్నో జన్మదినోత్సవాలను జరుపుకోవడంతోపాటు భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# నేతన్నలకు కూటమి ప్రభుత్వం అండ దండ

**- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్. ముక్క సాయి వికాస్ రెడ్డి**




పుల్లంపేట (ప్రజాసీమ) :తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం కొత్తపేట, పుత్తనవారిపల్లి గ్రామాల్లో నిర్వహించిన చేనేత గ్రామసభల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరవ శ్రీధర్, యువనేత ముక్కా సాయివికాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేతల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. చేనేతల కోసం 100 యూనిట్ల నుండి 200 యూనిట్ల వరకు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం గొప్ప నిర్ణయమని, దీన్ని ప్రతి లబ్ధిదారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హ్యాండ్లూమ్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయానంద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి చేనేతకారుడికి ఈ పథకం చేరేలా చర్యలు తీసుకుంటామని, వారికి చేనేత గుర్తింపు కార్డులు కూడా జారీ చేస్తామని తెలిపారు. తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీవో జయశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీరు, విద్య, వైద్యం, రెవెన్యూ సంబంధిత సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు కాలం నుండి తెలుగుదేశం పార్టీ చేనేతల అభివృద్ధికి కట్టుబడి ఉందని, సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. నేతన్నల మద్దతు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీకి ఉండాలని మీ అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుందని మీరందరూ కూడా పార్టీకి అండగా నిలబడాలని ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నం శివయ్య, మాజీ మండల అధ్యక్షులు ఆరె సుధాకర్ , నారాయణ నాయుడు.పోలి జగదీశ్వర్ రెడ్డి, భీముశేఖర్ రెడ్డి, భీమిశెట్టి నారాయణ, జంధ్యం సుబ్రమణ్యం, గండికోట రామకృష్ణ, చింతగింజల ద్వారక గోపీనాథ్, ఆకేపాటి సుధాకర్ రెడ్డి, చవన అంజి, ఓలేటి వెంకట్, నూకల శరణం, బోడా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# నేతన్న లకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**- చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయం - నేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఓ వరం - చమర్తి జగన్ మోహన్ రాజు**




సిద్ధవటం( ప్రజా సీమ ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు శనివారం ఉదయం సిద్ధవటం మండలం మాధవరం గ్రామపంచాయతీ మాధవరంలో సచివాలయం 2 వద్ద పర్యటిస్తూ చేనేతల ఉచిత విద్యుత్ అవగాహన సదస్సు కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజుముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఓ వరమని,చేనేతలుబలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడు తుందనన్నారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ చేనేత మగ్గాలు ఆగిపోకూడదని ఎన్నికల హామీలు ఎన్నికల హామీలో భాగంగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ ఎన్నోసంవత్సరాలుగా భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచమే గుర్తించేటట్లుగా చీరకట్టు,ధోతి ప్రత్యేకమైన వస్త్రధారణ ఆదర్శంగా ఇచ్చినటువంటి నేతను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. అదేవిధంగా చేనేతలను కాపాడుకోవడం కోసం కూటమి ప్రభుత్వం చేనేత వస్త్రాల పైన జిఎస్టిని తీసివేసిందని,మగ్గాలకు 200 యూనిట్లు/ పవర్లూమ్ లకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తుందన్నారు.మన ప్రాంతమైన మాధవరం చీరలు ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన చీరలని చమర్తి గుర్తు చేశారు. చేనేతలంతా ఐక్యంగా ఉండాలని,కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత శాఖ డైరెక్టర్లు , రవి ప్రకాష్ రావు, వనిత, రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్, నాగముని రెడ్డి, పుత్తా బాబు, నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు , కాడే చెంచయ్య నాయుడు, మాజీ మండలాధ్యక్షులు సామ శ్రీనివాసులు, బడి చర్ల శ్రీనివాసులు, రాజారాం, మండల ఐటీడీపీ అధ్యక్షులు హరి ప్రసాద్, మురళి, అధికారులు,ఒంటిమిట్ట సిద్ధవటం మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, చేనేత కార్మికులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దళిత మహిళా ఉద్యోగి పైన జనసేన నాయకులు దాడి చేయడం దుర్మార్గం



రైల్వేకోడూరు,(ప్రజా సీమ ): తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు, దళిత మహిళా ఉద్యోగి పైన జనసేన నాయకులు దాడి చేయడం దుర్మార్గం ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం . కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరి గల్ల శాంతయ్య. రైల్వేకోడూరు నియోజకవర్గంలో టోల్గేటు గాంధీ విగ్రహం వద్ద హర్ష వీణ అనే దళిత మహిళ ఉద్యోగి పైన జనసేనకు సంబంధించిన తాతంశెట్టి నాగేంద్ర అతని అనుచరులు పోలీసుల చూస్తుండగా దళితమహిళ పైన దాడి చేయడం, కుల దూషణకు దిగడం దుర్మార్గమైన చర్య దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము. మహిళా అని చూడకుండా నడిరోడ్డులో పట్టపగలు ఒక దళిత మహిళపై దాడి చేయడం కుల దురాహంకారమే కూటమి ప్రభుత్వం వస్తే మహిళల పైన ఎవరైనా దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు కానీ, మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మీ సొంత పార్టీ నాయకులు ఒక మహిళ పైన దాడి చేస్తే వాళ్ళపైన ఎందుకు చర్య తీసుకోలేదు కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న మహిళలకు రక్షణ కరువైంది జనసేన ఎమ్మెల్యే గారు వ్యక్తిగత విషయాలు చట్టా పరంగా కోర్టులో చూసుకోవాలి తప్ప బహిరంగంగా మహిళ పైన దాడి చేయడం ఎంతవరకు సమంజసం స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాల అవుతున్న నేటికీ మహిళలు వివక్షకు గురవుతూనే ఉన్నారు అర్ధరాత్రి మహిళా ఒంటరిగా తిరిగినప్పుడు నిజమైన స్వతంత్రం అని మహాత్మా గాంధీ అన్నారు కానీ కూటమి ప్రభుత్వం పాలనలో మహిళలకు రక్షణ ఏమాత్రం లేదు దళితుల పైన దళిత మహిళలు పైన దాడులు జరుగుతూనే ఉన్నాయి ఈ చర్యను దళిత సంఘాలు అన్ని దళిత నాయకులు ఖండించాలిడిప్యూటీ సీఎం ప్రశ్నిస్తా అని పార్టీ పెట్టిన పవన్ కళ్యాణ్ గారు ఎందుకు మహిళల పైన జరుగుతున్న దాడులను ఎందుకు మీరు ఖండించడం లేదు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రైల్వేకోడూరు కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, పలువురు వామపక్ష నాయకులు, పుల్లంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిగమాల రమేష్, రైల్వే కోడూరు నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాసల బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహార పదార్ధాలు పంపిణీ




మదనపల్లె (ప్రజా సీమ) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి టీబి యూనిట్‌లో దాతల సహకారంతో ప్రధాన మంత్రి టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మొండి క్షయ (టిబి) వ్యాధిగ్రస్తులకు పోషకాహార పదార్థాలు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమం ద్వారా పది మంది మొండి క్షయ రోగులను ఆరునెలల పాటు దత్తత తీసుకుని,వారికి ప్రతినెల అవసరమైన పోషకాహార పదార్థాలు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి మదనపల్లి పట్టణానికి చెందిన బెస్ట్ బైషాప్ నిర్వహకులు జవహర్ హుస్సేన్ మరియు వికాస్ ప్రభాకర్ ముందుకు వచ్చి టీబి రోగులను దత్తత తీసుకున్నారు.క్షయవ్యాధి చికిత్సలో ఔషధాలతోపాటు సరైన పోషకాహారం కూడా అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో,దాతలు ముందుకు వచ్చి రోగులకు అవసరమైన ఆహార పదార్థాలు అందించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడటానికి,శరీర దృఢత్వం పెరగడానికి మరియు త్వరగా కోలుకునేందుకు తోడ్పడుతున్నారు.ఈ సందర్భంగా దాతలు జవహర్ హుస్సేన్ మరియు వికాస్ ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతిఒక్కరూ తమవంతు సహాయం అందిస్తే టిబి నిర్మూలన లక్ష్యాన్ని త్వరగా సాధించవచ్చని తెలిపారు.ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన రోగులకు ఇలాంటి సహాయం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రోగుల్లో నమ్మకం పెంపొందడంతోపాటు,చికిత్స పట్ల ఆసక్తి పెరుగుతుందని,మధ్యలో చికిత్స ఆపివేయకుండా పూర్తిగా కొనసాగించేందుకు ఇది ప్రోత్సహిస్తుందని వైద్య సిబ్బంది తెలిపారు.ఈ కార్యక్రమంలో టీబి విభాగం సిబ్బంది దయాలన్,ప్రభాకర్,శాంతి,సుశీల,వనజ కుమారి చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మొత్తం మీద ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తూ,ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న టిబి రోగులకు మద్దతు అందించే ఆదర్శ కార్యక్రమంగా నిలిచింది.

# రైతన్న,నేతన్న లకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**- చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయం - నేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఓ వరం**
**- నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**







ఒంటిమిట్ట,(ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. శనివారం నాడు ఒంటిమిట్ట,సిద్ధవటం మండలాలలో పర్యటిస్తూ చేనేతల ఉచిత విద్యుత్ అవగాహన సదస్సు కార్యక్రమానికి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఓ వరమని,చేనేతలు బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందనన్నారు.అదేవిధంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ చేనేత మగ్గాలు ఆగిపోకూడదని ఎన్నికల హామీలు ఎన్నికల హామీలో భాగంగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా భారతదేశ సంస్కృతి,సాంప్రదాయాలను ప్రపంచమే గుర్తించేటట్లుగా చీరకట్టు,ధోతి ప్రత్యేకమైన వస్త్రధారణ ఆదర్శంగా ఇచ్చినటువంటి నేతను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. అదేవిధంగా చేనేతలను కాపాడుకోవడం కోసం కూటమి ప్రభుత్వం చేనేత వస్త్రాల పైన జిఎస్టిని తీసివేసిందని,మగ్గాలకు 200 యూనిట్లు, పవర్లూమ్ లకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తుందన్నారు.మన ప్రాంతమైన మాధవరం చీరలు ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన చీరలని చమర్తి గుర్తు చేశారు. చేనేతలంతా ఐక్యంగా ఉండాలని,కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు,ఒంటిమిట్ట సిద్ధవటం మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాసీమ
PRGI Regd. No : APTEL/26/A0819
జాతీయ తెలుగు దినపత్రిక


# బి ఆర్ నాయుడు ను తొలగించండి తిరుమల పవిత్రతను కాపాడండి : మాజీ ఎమ్మెల్యే కొరముట్ల







రైల్వేకోడూరు ( ప్రజాసీమ) : రైల్వే కోడూరు:బి.ఆర్ నాయుడు ను టీటీడీ చైర్మన్ గా వెంటనే తొలగించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఎన్ని విమర్శలు ఆరోపణలు వచ్చిన కళంకితుడైన బిఆర్ నాయుడు ను చంద్రబాబు నాయడు ను వెనుక వేసుకురావడం అత్యంత దారుణమని వేరే మహిళతో తప్పుగా బిహేవ్ చేస్తూ ఉన్న వీడియోలు చంద్రబాబుకు కనపడలేదా ఆయన వీడియోలు వైరల్ అయినా ఇన్ని రోజులు గడిచిన ఆయన పైన చర్యలు తీసుకోకపోవడం పైగా తిరుమలలో ఏదేచ్ఛగా దైవిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అపచారాలకు పాల్పడుతున్నారని నిన్న కూడా పవిత్రమైన క్షేత్రం ఒంటిమిట్ట కోదండ రామలయంలో రాముల వారి కళ్యాణంలో నీసిగ్గుగా డియర్ నాయుడు ను చంద్రబాబు నాయుడు వెనుక వేసుకుని తిరగారాని టీటీడీ పవిత్రతను ప్రతిష్టను ముఖ్యమంత్రి చంద్రబాబు గంగపాలు చేస్తు దారుణంగా దెబ్బతీస్తున్నారని తన చేతులతో తానే ధర్మాన్ని భంగం వాటిల్లే లా చేస్తున్నారని ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు కళ్ళు తెరిచి టిటిడి చైర్మన్గా బీర్ నాయుడును వెంటనే తొలగించి తిరుమల పవిత్రతను కాపాడాలని రెండు చేతులు జోడించి వేడుకుంటున్నామని లేనియెడల ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి తిరుమల పవిత్రతను కాపాడుకుంటామని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కోడూరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు కొరుముట్ల శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పంజం వేణుగోపాల్ రెడ్డి,మాదినేని వెంకట్ రెడ్డి,జడ్పీటీసీ రత్నమ్మ,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముందల నాగేంద్ర,స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ నంద బాల, పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి లింగం లక్ష్మీకర్,రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, స్టేట్ మహిళా విభాగం సెక్రెటరీ లక్ష్మీనారాయణమ్మ, జిల్లా యువజన విభాగం సెక్రటరీ దమ్ము రఘు, ఎంపీటీసీలు బండారు మల్లికార్జున, గని (రాజా ) పుష్పలత, లక్కిరెడ్డి రాజారెడ్డి, కరిముల్లా, డివి రమణ, సిద్దయ్య, రత్తయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణ మహోత్సవశీ లో పాల్గొన్న పారిశ్రామికవేత మాచినేని విశ్వేశ్వర్ నాయుడు





రైల్వేకోడూరు(ప్రజా సీమ) : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం చిట్వేలి మండలంలోని తుమ్మచట్లపల్లి గ్రామం నందు ప్రముఖ పారిశ్రామికవేత మాచినేని విశ్వేశ్వర నాయుడు మరియు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల సుబ్బరాయుడు (లారీ) ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ సీతా రాముల వారి కళ్యాణ మహోత్సవంలోలి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు . ఈ కార్యక్రమంలో కసన్తూరి విశ్వనాధ నాయుడు తో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగ అధ్యక్షులు పంతగాని నర్సింహ ప్రసాద్ మరియు ముఖ్య కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొనడం జరిగినది.

# కమనీయ సీతారాముల కళ్యాణం

## - కళ్యాణం లో చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి దంపతులు

## - వచ్చిన భక్తులకు అన్నప్రసాదం వితరణ





చిట్వేలి,(ప్రజా సీమ) : అంగరంగ వైభవంగా కమనీయ కళ్యాణం సీతారాములకు జరిగింది. శనివారం, మండల కేంద్రంలోని గాజుల వీధిలో వెలసిన సీతారాముల ఆలయంలోని ఉత్సవమూర్తులకు వేద పండితుల నడుమ కళ్యాణ మహోత్సవం వైభవంగా చిట్వేలి గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి, దంపతులు. కళ్యాణ ఘట్టంలో పాల్గొని సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామంలోని మహిళలు కమనీయ కళ్యాణాన్ని తిలకించారు. సీతారాముల కళ్యాణం విశిష్టతను వివరిస్తూ వేద పండితులు కళ్యాణం జరిపించారు. సీతారాముల కళ్యాణం చూసిన కళ్యాణం జరిపించిన అంత పుణ్యఫలం సాఫల్యం అవుతుందని పండితులు వివరిస్తూ కళ్యాణ ఘట్టాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో కళ్యాణానికి విచ్చేసి స్వామి అమ్మవార్ల కళ్యాణం తిలకించారు. వచ్చిన భక్తులకు కళ్యాణం అనంతరం అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసి వచ్చిన భక్తులకు అందజేశారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన పానకం, వడపప్పు, పలు రకాల వంటలు స్వామివారి కైకర్యాలలో వినియోగించిన వాటిని విచ్చేసిన భక్తులకు మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాల వినియోగాన్ని భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో చౌడవరం ఉ మామహేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులు గాజుల వీధి భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఆర్టీవో వినోద్




రాజంపేట (ప్రజా సీమ): కడప జిల్లా రాజంపేట మండలం కొత్త బోయినపల్లి ఆర్టీవో కార్యాలయం వద్ద శనివారం ఆర్టీవో వినోద్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు వివిధ కారణాలపై పట్టు పడ్డారు. కొందరికి జరిమానా విధించగా, మరికొందరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్క వాహదారుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని,అలా చేసినప్పుడే ప్రమాదాల నివారణ జరుగుతుందని వారికి తగు సూచనలు చేశారు.

# తూమకుంటలో ఇంకనూ నిర్మాణంలో ఉన్న100 మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలి

## - కలెక్టర్ నిశాంత్ కుమార్





గాలివీడు,(ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూమకుంట గ్రామంలో హెచ్పిసిఎల్ రెన్యువబుల్ అండ్ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో దాదాపు 500 ఎకరాల విస్తీర్ణంలో 500 మెగావాట్ సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ఇంకనూ నిర్మాణ దశలో ఉన్న 100 మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ప్లాంట్ స్థలాన్ని కలెక్టర్ విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ దశ, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనుల పురోగతి తదితర అంశాలపై సంబంధిత అధికారులను, సైట్ ఇంజినీర్లను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేసి వచ్చే నాలుగు నుండి ఐదు నెలల్లో మొత్తం ప్రాజెక్టును పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సైట్ ఇంజినీర్ కలెక్టర్కు వివరించారు. ప్లాంట్ ఏర్పాటులో కొన్నిచోట్ల భూమి సంబంధిత సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం సహకారం అందించాలని సైట్ ఇంజినీర్ కోరగా, సమస్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. నివేదిక ఆధారంగా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సోలార్ పవర్ ప్రాజెక్టు పూర్తయిన తరువాత ప్రాంతీయ విద్యుత్ అవసరాలకు గణనీయమైన మద్దతు లభించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు సమయానికి పూర్తి కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అదేవిధంగా పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా ప్రమాణాలు పాటించాలని, భద్రతా చర్యలు ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రాజెక్టు పి.డి పురుషోత్తం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ గా పయ్యావుల మోహన్ కృష్ణ బాధ్యత



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: నందలూరు డిప్యూటీ తహసీల్దార్ గా పనిచేస్తూ వేంపల్లె తహసీల్దార్ పయ్యావుల మోహన్ కృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆ మేరకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. దీంతో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలపై పరిష్కారాని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధాని అమరవతికి



పెనగలూరు ప్రజా సీమ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజవర్గం పెనగలూరు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎంజర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెనగలూరు టిడిపి కార్యాలయం నందు దీపాలు వెలిగించి తన సంతోషాన్ని తెలియజేశారు మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధాని అమరవతిగా పార్లమెంట్లో ఆమోదం పొందడం సంతోషకరమని మార్చి 28 న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించి ఆ తీర్మానాన్ని పార్లమెంటు పంపడం పార్లమెంట్లో ఈ బిల్లు ఆమోదం పొందడం సంతోషకరమని ఇందుకు కారణమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు భారత ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ పుచ్చకాయల రవి, క్లస్టర్ ఇంచార్జ్ పుచ్చకాయల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షేక్ షామీర్ భాష, రైల్వేకోడూరు నియోజవర్గ తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి తటిపోయిన ధన, నియోజక వాణిజ్య విభాగం కార్యదర్శి కోలా మురళి, యూనిట్ ఇంచార్జ్ కమతం జయరాం, డాక్టర్ రామకృష్ణ, యూనిట్ ఇంచార్జ్ కాకి శ్రీరామ్,మరియు టిడిపి పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పీహెచ్సీలో పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవలను మెరుగుపరచాలి

### - గాలివీడు పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్
### - పీహెచ్సీలో సేవల లోపాలు.. సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలకు ఆదేశాలు




గాలివీడు,(ప్రజా సీమ) :గాలివీడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవల పనితీరు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. తనిఖీ సమయంలో సిబ్బంది హాజరు పట్టిక సక్రమంగా నిర్వహించకపోవడం, పలువురు సిబ్బంది గైర్హాజరు ఉన్నట్లు గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రసూతి గది (లేబర్ రూమ్) పరిశీలనలో అత్యవసర మందులు అయిన మెగ్నీషియం సల్ఫేట్, డెక్ట్రోస్, అట్రోపిన్,ఆక్సిటోసిన్ మందులు మరియు జంటామైసిన్, డైజోఫాం, మెట్రోనిడజోల్ ఇంజక్షన్లు సక్రమంగా నిల్వ చేయకపోవడం, లేబర్ రూమ్ ప్రోటోకాల్‌కు అనుగుణంగా అత్యవసర ఔషధాల ట్రే మరియు ఇతర ట్రేలను సక్రమంగా నిర్వహించకపోవడంతోపాటు డ్రగ్ స్టోర్‌లో మందుల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఔషధాల స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రి పరిసరాలు, లేబర్ రూమ్, జనరల్ వార్డు, మరుగుదొడ్లలో పరిశుభ్రత లోపంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. రోగులకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలను తక్షణమే మెరుగుపరచాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రజలకు కీలక వైద్య సేవలను అందించే కేంద్రాలుగా ఉంటాయని, అక్కడి సేవలు నాణ్యంగా ఉండేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో తహసీల్దార్, సీఐ, వైద్యులు, సిబ్బందిలు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన సర్వేయర్ల క్రికెట్ టోర్నమెంట్

### - హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు
### - సరదాగా క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా




మదనపల్లె (ప్రజాసీమ) : పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో శనివారం సర్వే డే సందర్భంగా జిల్లా సర్వేయర్లు సంయుక్తంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు,టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు హాజరై పోటీలను ప్రారంభించారు. అతిథులు క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి సర్వేయర్లతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడి కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు. అనంతరం సర్వేయర్లు అతిథులకు ఘనస్వాగతం పలికి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ సర్వేయర్లు భూమి కొలతలు,ప్రభుత్వ భూ నిర్వహణ,అభివృద్ధి ప్రాజెక్టుల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజలకు సేవలందించే సర్వేయర్ల పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే ఉద్యోగ ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా జిల్లా సర్వేయర్ల మధ్య ఐక్యత,స్నేహభావం పెరుగుతుందని,యువత క్రీడలవైపు ఆసక్తి పెంచుకోవాలని సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్లు,స్థానిక నాయకులు చిప్పిలి గురునాథ్ యాదవ్,జెసిబి వేణు,రెడ్డి రాయల్,జాన్ బాబు,కళాశాల ప్రతినిధులు,వివిధ మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు.

# పోలీసులపై దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పు

### - దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి: కె. ధర్మచందు



తిరుపతి, ఏప్రిల్ 04(ప్రజా సీమ):పోలీసులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ స్టేట్ సెక్రటరీ కె. ధర్మచందు పేర్కొన్నారు. కార్వేటినగరం మండలానికి చెందిన ఒక కానిస్టేబుల్‌పై ఈరోజు ఉదయం కొందరు దుండగులు అడ్డగించి దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమించే పోలీసులను "కనిపించే దైవాలు"గా భావించాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి పోలీసులపై దాడులు జరగడం సమాజానికి, ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. చట్టాన్ని అమలు చేయడంలో భాగంగా పోలీసులు తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటే, వారిపై దాడులు చేయడం అసహనకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పెరుగుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ఆయన వేడుకుంటూ, పోలీసులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంతటి వ్యక్తులైనా చట్టానికి లోబడాల్సిందేనని, తప్పు చేసిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ సమాజ శాంతి భద్రతలకు మూలస్తంభమని పేర్కొంటూ, ప్రజలందరూ పోలీసులను గౌరవించాలని, వారికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా సమాజం మొత్తం చైతన్యంతో ముందుకు రావాలని కె. ధర్మచందు కోరారు.

# జిల్లా బాల భవిత కేంద్రం సందర్శన






కడప, ఏప్రిల్ 4 (ప్రజా సీమ) : 2026 ఏప్రిల్ 4 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి యామిని కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ల సూచనల మేరకు డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్రకాంతమ్మ, శాంత అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ కడప నగరంలో రిమ్స్ నందు గల జిల్లా బాల భవిత కేంద్రమును తనిఖీ చేసి అక్కడికి వచ్చే 18 సంవత్సరాల లోపు పిల్లల యొక్క ఆరోగ్య పరిస్థితిని అలాగే కేంద్రములో పిల్లలకి అందే చికిత్స పని తీరును, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చౌదరి, ఉదయ్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది , కేంద్రం మేనేజర్, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# టీటీడీ చైర్మన్ పదవి నుండి బి ఆర్ నాయుడు ని తొలగించాలి

### -వైకాపా నియోజకవర్గ ఇన్చార్జి ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి




రాజంపేట.ఏప్రిల్.4(ప్రజా సీమ): తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా ఉన్న బి.ఆర్ నాయుడు ని పదవి నుండి వెంటనే తొలగించాలని, రాజంపేట లో టీటీడీ చైర్మన్ వ్యవహార శైలిపై రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. శనివారం టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు తొలగించాలని డిమాండ్ చేస్తూ రాజంపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాజంపేట మండలం ఆకేపాడు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి, బి ఆర్ నాయుడు అనైతిక కార్యకలాపాలు, ఆయన వ్యవహార శైలితో టీటీడీ పవిత్రతను దెబ్బతీస్తున్నాడని ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించి నట్లు వైకాపా రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. బిఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ పదవి నుంచి వెంటనే తొలగించి, టిటిడి పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం పూర్తిగా శాంతియుతంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఉద్దేశంతో చేస్తున్నామని అన్నారు. కానీ ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డు కొని గృహనిర్బంధనలు చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, రాజంపేట మండల కన్వీనర్ భాస్కర్ రాజు,పార్టీ నాయకులు,వేణుగోపాల్ రెడ్డి, సురేంద్ర,శ్రీను, రవి శేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి,రమణ, రెడ్డయ్య, జీవన్, శివ కుమార్, కళ్యాణ్,పార్టీ అభిమానులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మిట్స్ వర్సిటీ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం






మదనపల్లె ఏప్రిల్ 4,(ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు నందు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం మరియు మిట్స్ అల్యూమిని వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ నందు 2018 మరియు 2025 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సయ్యద్ మాజ్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల మధ్య అను సంధానాన్ని బలో పేతం చేయడంలో అల్యూమిని పోర్టల్, లింక్డ్ఇన్ వంటి వేదికలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. అల్యూమిని పోర్టల్ ద్వారా పూర్వ విద్యార్థుల వివరాలు ఒకే వేదికలో అందు బాటులో ఉండటం తో, వారితో సులభంగా సంబంధాలు ఏర్పరచుకోవచ్చు నన్నారు.

ఉద్యోగ అవకాశాలు, ఇంటర్న్‌షిప్‌లు, మెంటారింగ్ వంటి అనేక అవకాశాలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే లింక్డ్ఇన్ ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలు, ప్రాజెక్టులు, విజయాలను ప్రపంచానికి పరిచయం చేసుకొని, పరిశ్రమ నిపుణులతో నెట్‌వర్క్ పెంపొందించు కోవచ్చని పేర్కొన్నారు. ఈ వేదికలను సమర్థ వంతంగా వినియోగించు కోవడం ద్వారా విద్యార్థులు తమ కెరీర్ అభివృద్ధిని వేగవంతం చేసు కోవడంతో పాటు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. అల్యూమిని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగ శ్వేతా మాట్లాడుతూ అల్యూమిని, యూనివర్సిటీ మధ్య బలమైన అనుబంధం కొనసాగితే విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని, సమాజానికి ఉపయోగ పడే నాణ్యమైన ఇంజినీర్లను తయారు చేయడం సాధ్యమవు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పూర్వ విద్యార్థులు ఇందులో పాల్గొని తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నారు. సంస్థతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, విద్యార్థి దశలో పొందిన విద్య, మార్గ దర్శకం తమ వృత్తి జీవితంలో ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ డీన్ ఇండస్ట్రీ రేలేషన్స్ డాక్టర్ పి.ఎమ్ బాలాజీ, డాక్టర్ ఏ వి పవన్ కుమార్, అల్యూమిని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి.నాగ శ్వేతా, విద్యార్థులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## అంతర్జాతీయ వేదికపై మరోసారి.. అరుదైన ఘనత సాధించిన రష్మిక!



పేరుకే కన్నడ బ్యూటీ.. నేడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న రష్మిక మందన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. అందం అభినయంతో కాదు నటనతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది ఈ చిన్నది.. నేడు పాన్ ఇండియా స్టార్ హీరోయిన్గా చలామణి అవుతున్న ఈమె.. గత మూడు సంవత్సరాలుగా వరుస చిత్రాలతో.. ఊహించని విజయాలతో.. బాక్సాఫీస్ కలెక్షన్స్ తో స్టార్ హీరోల రికార్డులను కూడా బ్రేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు. అంతర్జాతీయ వేదికపై రెండవసారి.. పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, సికందర్ , ది గర్ల్ ఫ్రెండ్, కుబేర ఇలా వరుస పెట్టి సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ వసూలు చేస్తూ.. బాక్సాఫీస్ క్వీన్ గా పేరు సొంతం చేసుకుంది రష్మిక మందన్న . ఇదిలా ఉండగా అటు కెరియర్ పరంగా బిజీగా మారిన ఈమె.. ఇటు వ్యక్తిగతంగా తన ప్రాణ స్నేహితుడైన విజయ్ దేవరకొండ తో ఏడడుగులు కూడా వేసింది. ఇక ఇప్పుడు వివాహితగా మారిన తర్వాత తన భర్త విజయ్ దేవరకొండ తో కలిసి చేస్తున్న తొలి చిత్రం రణబాలి. ఇప్పటికే ఈ సినిమాలోని రాయలసీమ ప్రాంతానికి సంబంధించి షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకున్నారు. మరొకవైపు మైసా అనే సినిమాలో కూడా నటిస్తోంది రష్మిక . ఇలా కెరియర్ పరంగా వరుస చిత్రాలతో బిజీగా మారిన ఈమె తాజాగా మరోసారి అంతర్జాతీయ వేదికపై కనిపించనుంది. అంతేకాదు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సినీ నటిగా పేరు కూడా సొంతం చేసుకుంది రష్మిక. పూర్తి వివరాల్లోకి వెళితే.. జపాన్ లోని టోక్యోలో మే 23వ తేదీన జరగనున్న " క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 2026"లో రష్మిక ప్రజెంటర్ గా వ్యవహరించబోతోంది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఈమె రెండవసారి కనిపించడం గమనార్హం.. 2024 లోనే ఈమె ఈ అవార్డ్స్ వేడుకల్లో ప్రజెంటర్ గా సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకసారి ఈ అవకాశం అందుకోవడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఈ ప్రతిష్టాత్మక వేదికపై వరుసగా రెండుసార్లు అవార్డులు అందజేస్తున్న తొలి భారతీయ నటిగా రష్మిక చరిత్ర సృష్టించింది. పైగా పుష్ప సినిమాతో జపాన్ లో భారీ క్రేజ్ సంపాదించుకున్న ఈమెను క్రంచీరోల్ సంస్థ "ఇండియా స్వీట్ హార్ట్" గా అభివర్ణించింది. ఇకపోతే ఈ క్రెడిట్ మొత్తం పుష్ప సినిమాకే లభిస్తుందని అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఎందుకంటే పుష్ప సినిమాలో శ్రీవల్లి పాత్రతో అందరినీ ఆకట్టుకుంది రష్మిక. జపాన్లో ఈ సినిమా విడుదల చేసినప్పుడు శ్రీవల్లి పాత్రకు అక్కడి జపాన్ ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఆమెకు విపరీతమైన ఫాలోయింగ్ కూడా వచ్చేసింది. ఈ నేపథ్యంలోనే అక్కడి సోషల్ మీడియా ఫాలోయింగ్ చూసి నిర్వాహకులు ఈమెను వరుసగా మళ్లీ ఆహ్వానించినట్లు తెలుస్తోంది . ఏది ఏమైనా భారతీయ నటీమణులు ఇలా గ్లోబల్ స్టార్లుగా ఎదుగుతున్నారు అనడానికి రష్మిక మరో ఉదాహరణగా నిలిచింది అని చెప్పవచ్చు. ఇప్పటికే ఆస్కార్ వేదికపై ప్రియాంక చోప్రా రెండవసారి కనిపించి సంచలనం సృష్టించింది.

## ఆస్కార్ చరిత్రలోనే ఫస్ట్ మూవీ.. మన శేష్ కు నచ్చలేదా?




ఆస్కార్ రేసులో రీసెంట్ గా సంచలనం సృష్టించిన సిన్నర్స్ సినిమాపై టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. భారీ అంచనాలతో, రికార్డు స్థాయిలో నామినేషన్లతో చర్చల్లో నిలిచిన ఆ సినిమా గురించి అడివి శేష్ చెప్పిన అభిప్రాయం చర్చనీయాంశమైంది. అసలేం జరిగిందంటే? ర్యాన్ కూగ్లర్ దర్శకత్వంలో తెరకెక్కిన సిన్నర్స్ చిత్రం ఆస్కార్ అవార్డ్స్ లో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ ఎడిటింగ్, ప్రొడక్షన్ డిజైన్ వంటి ప్రధాన విభాగాలతో కలిపి మొత్తం 16 నామినేషన్లు దక్కించుకుని ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇంతకుముందు 14 నామినేషన్లతో ఉన్న సినిమాల రికార్డును ఈ చిత్రం అధిగమించడం విశేషం. దీంతో ఆస్కార్ చరిత్రలో అత్యధిక నామినేషన్లు సాధించిన తొలి చిత్రంగా సిన్నర్స్ నిలిచింది. హారర్ థ్రిల్లర్ గా రూపొందిన ఆ సినిమాలో ప్రముఖ హాలీవుడ్ నటుడు మైఖేల్ బి జోర్డాన్ ప్రధాన పాత్ర పోషించారు. స్మోక్, స్టాక్ అనే కవల సోదరుల జీవితాల చుట్టూ తిరిగే కథలో థ్రిల్లింగ్ ట్విస్టులు, సస్పెన్స్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఆ కారణంగానే సినిమా అంతర్జాతీయంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఆ చిత్రంపై అడివి శేష్ భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. తన రాబోయే చిత్రం డెకాయిట్ ప్రమోషన్స్ లో భాగంగా మాట్లాడిన ఆయనకు సిన్నర్స్ అంతగా నచ్చలేదని స్పష్టం చేశారు. ఆ సినిమా ద్వారా దర్శకుడు ఏం చెప్పాలనుకున్నారో తనకు స్పష్టంగా అర్థం కాలేదని తెలిపారు. ఇది వాంపైర్ స్టోరీనా, లేక జాతి వివక్షపై కామెంటా, లేదా నల్లజాతిపై ఏదైనా సందేశమా అన్నది కన్ఫ్యూజ్ గా అనిపించిందని చెప్పారు.

## రక్షిత లేటెస్ట్ లుక్ వైరల్.. ఫ్యాన్స్‌కు బిగ్ సర్ప్రైజ్




రవితేజ 'ఇడియట్' సినిమా గుర్తుందా? అందులో రవితేజ వెంటపడే ఆ గ్రీకు సుందరి రక్షితను ఎవరూ మర్చిపోలేరు. మహేశ్‌బాబు, నాగార్జున, ఎన్టీఆర్ వంటి టాప్ హీరోలతో జోడీ కట్టి ఒకప్పుడు సౌత్ ఇండియాను ఊపేసిన ఈ స్టార్ హీరోయిన్, ఇప్పుడు ఎలా ఉందో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. చాలా కాలం తర్వాత లేటెస్ట్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో అభిమానులు షాక్‌కు గురవుతున్నారు. వెండితెరకు దూరమైన రక్షిత ప్రస్తుత జీవితం, ఆమె లుక్ వెనుక ఉన్న అసలు కారణాలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఆ వివరాలు చూద్దాం.. రక్షిత అసలు పేరు శ్వేత. సినిమాల్లోకి వచ్చాక రక్షితగా మారింది. తండ్రి కొరియోగ్రాఫర్, తల్లి నటి కావడంతో ఆమెకు ఇండస్ట్రీ ఎంట్రీ ఈజీగానే దొరికింది. పునీత్ రాజ్‌కుమార్ సరసన కన్నడలో 'అప్పు' సినిమాతో మొదలైన ఆమె ప్రయాణం, తెలుగులో 'ఇడియట్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత నాగార్జునతో 'శివమణి', మహేశ్‌బాబుతో 'నిజం', ఎన్టీఆర్‌తో 'ఆంధ్రావాలా' వంటి వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోయింది. ఇక తెలుగు, కన్నడ భాషల్లో సమానంగా క్రేజ్ సంపాదించుకున్న అతికొద్ది మంది హీరోయిన్లలో రక్షిత ఒకరు. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే రక్షిత ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. 2007లో కన్నడ దర్శకుడు ప్రేమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెళ్లయ్యాక ఇక సినిమాల్లో నటించకూడదని నిర్ణయించుకుని వెండితెరకు పూర్తిగా దూరమైపోయింది. అయితే ఇక సినిమా రంగంపై ఉన్న మక్కువతో నిర్మాతగా మారి 'జోగయ్య', 'డీకే' వంటి చిత్రాలను నిర్మించింది. నటిగా కాకుండా తెర వెనుక ఉండి తన భర్త సినిమాలకు అండగా నిలిచింది. గ్లామర్ ప్రపంచానికి దూరంగా తన కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతోంది. తాజాగా రక్షిత బర్త్ డే వేడుకలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు బయటకు వచ్చాయి. ఇందులో ఆమెను చూసి అభిమానులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకప్పుడు నాజూగ్గా ఉన్న రక్షిత, ఇప్పుడు చాలా బొద్దుగా మారిపోయారు. ఇక ఆమెలో వచ్చిన ఈ మార్పు చూసి సోషల్ మీడియాలో రకరకాల చర్చలు మొదలయ్యాయి. అయితే దీనిపై ఆమె గతంలోనే క్లారిటీ ఇచ్చారు. కొడుకు పుట్టిన తర్వాత థైరాయిడ్ సమస్య రావడంతోనే తాను ఇలా బరువెక్కానని, ఇప్పుడు తాను హీరోయిన్ కాదు కాబట్టి నాజూగ్గా ఉండాల్సిన అవసరం లేదని ఆమె కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. నటనకు దూరమైనా రక్షిత బుల్లితెరపై మాత్రం సందడి చేస్తూనే ఉన్నారు. పలు కన్నడ రియాలిటీ షోలకు ఆమె జడ్జిగా వ్యవహరిస్తున్నారు. ఆమె తాజా లుక్ చూసి కొందరు నెటిజన్లు ఆశ్చర్యపోతున్నా, మరికొందరు మాత్రం ఆమె ఆత్మవిశ్వాసాన్ని మెచ్చుకుంటున్నారు. "మనుషులు అన్నాక వయసుతో పాటు మార్పులు సహజం, ఆమె ఇప్పటికీ తన నవ్వుతో అలరిస్తున్నారు" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఏదేమైనా 'ఇడియట్' బ్యూటీ తన ఫ్యాన్స్‌కు ఒక బిగ్ సర్ప్రైజ్ ఇచ్చిందనే చెప్పాలి. ఐతే రూపం మారినా అభిమానుల గుండెల్లో రక్షిత స్థానం అలాగే ఉంది.



## నెల రోజులు నాని ఒళ్లు నలిగిపోతుందా!

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో -ది ప్యారడైజ్- షూటింగ్ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. -దసరా- లాంటి మాస్ హిట్ తర్వాత మళ్లీ అదే కాంబినేషన్ లో సినిమా కావడంతో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా ఈ సినిమా కోసం నాని గతంలో ఎన్నడూ లేని విధంగా తన శరీరాన్ని కష్టపెడుతున్నట్లు తెలుస్తోంది. సినిమాలోని కీలకమైన యాక్షన్ షెడ్యూల్ కోసం ఏకధాటిగా నెల రోజుల పాటు షూటింగ్ ప్లాన్ చేశారు. ఈ సుదీర్ఘమైన షెడ్యూల్‌లో పూర్తిగా భారీ యాక్షన్ సన్నివేశాలనే చిత్రీకరించనున్నట్లు చిత్ర యూనిట్ వర్గాల సమాచారం. ముఖ్యంగా సినిమా విరామానికి ముందు వచ్చే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను ప్రస్తుతం షూట్ చేస్తున్నారు. ఈ సీన్లు వెండితెరపై ప్రేక్షకులకు రోమాంచిత అనుభూతిని కలిగిస్తాయని, నాని కెరీర్‌లోనే అత్యంత కష్టతరమైన ఫైట్స్ అని టాక్ వినిపిస్తోంది. ఈ పోరాట దృశ్యాల కోసం నాని ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుని బరిలోకి దిగినట్లు తెలుస్తోంది. సాధారణంగా నాని సినిమాలు ఎమోషన్స్ , కథా బలంతో సాగుతాయి. కానీ ది ప్యారడైజ్లో మాత్రం యాక్షన్ డోస్ ఎక్కువగా ఉండబోతోంది. ఎలాంటి డూప్ సహాయం లేకుండా చాలా వరకు రిస్కీ షాట్స్ నాని స్వయంగా చేస్తున్నారుట. ఈ క్రమంలో నాని ఒళ్లు నలిగిపోయేలా శ్రమిస్తున్నారని సెట్స్ నుండి అందుతున్న సమాచారం. గతంలో -దసరా- సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాల్లో నటించిన అనుభవం ఉండటంతో ఈసారి పని సులభమవుతుంది. శ్రీకాంత్ వర్కింగ్ స్టైల్ కూడా అలవాటైంది కాబట్టి పర్వాలేదు. శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని అత్యంత రా అండ్ రస్టిక్ గా తెరకెక్కిస్తున్నారు. 1990ల కాలం నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో యాక్షన్ సన్నివేశాలు చాలా సహజంగా, వయొలెంట్‌గా ఉంటాయని సమాచారం. నాని మేకోవర్ కూడా ఈ సినిమా కోసం పూర్తిగా మారిపోయింది. గడ్డం, జుట్టు పెంచి ఒక ఊర మాస్ లుక్‌లో ఆయన కనిపిస్తున్నారు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma